అధికారులకు భారం..
ప్రగతికి దూరం

- ఎంపీడీఓ కార్యాలయంలో భర్తీకాని పోస్టులు
- సంక్షేమ కార్యక్రమాల అమలులో వరదయ్యపాళెం వెనుకంజ
- ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోలేక అవస్థలు



వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయం

వరదయ్యపాళెం : మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి అధికారుల కొరత వేధిస్తోంది. ఈక్రమంలో ప్రభుత్వం నిర్వహించే సర్వేలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, లక్ష్యాలను సకాలంలో చేరుకోలేక అపసోపాలు పడుతున్నారు. ప్రతి విషయంలోనూ జిల్లాలో వెనుకబడిన మండలాల్లో వరదయ్యపాళెం ఉంటోంది. లక్ష్యం చేరుకోవడంలో వెనుకబడుతున్న అధికారుల తీరుపై ఉన్నతాధికారుల నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బదిలీల్లో కార్యాలయం నుంచి వెళ్లిన వారి స్థానాల్లో ఇతరులను భర్తీ చేయకపోవడంతో సిబ్బంది అగచాట్లు పడుతున్నారు.దీంతో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో మండలం వెనుకబాటుకు గురవుతోంది.

సకాలంలో పనులు సాగక..

సిబ్బంది కొరత కారణంగా వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోతున్నాయి. ప్రధానంగా ఒకటో తేదీకి పంపిణీ కావాల్సిన పింఛన్ కార్యక్రమానికి సిబ్బంది కొరత ఇబ్బందిగా మారుతోంది. ప్రధానంగా మండలంలో 29 పంచాయతీలు ఉండగా 7 గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు లేక ఇన్‌చార్జుల పాలనలో సాగుతున్నాయి. ప్రధానంగా చిన్న పాండూరు, మరదవాడ, పులివల్లం, చిలమత్తూరు, ముస్లింపాళెం, గూడలవారిపాళెం, తొండూరు పంచాయతీలకు కార్యదర్శులు లేరు. దీంతో ఈ పంచాయతీల పరిధిలో పింఛన్ల పంపిణీ పర్యవేక్షించాల్సిన కార్యదర్శులే లేకపోవడంతో ఆయా గ్రామాలకు ఎంపీడీఓ కార్యాలయ అటెండర్లు, క్లర్కులకు సైతం పింఛన్ పంపిణీ బాధ్యతలను అప్పగించాల్సిన దుస్థితి నెలకొంది.

ముందుకు సాగని సర్వే

కూటమి ప్రభుత్వం ఇంటింటా హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ పేరిట సర్వే నిర్వహిస్తోంది. ఈ బాధ్యతలు పూర్తిగా ఎంపీడీఓ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది చేపట్టాల్సి ఉంది. అయితే మండలంలో పూర్తి స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు లేకపోవడం, దీనికి తోడు గ్రామ సచివాలయాల్లో సైతం ఇటీవల జరిగిన బదిలీల్లో పలువురు సచివాలయ సిబ్బంది వారి సొంత మండలాలకు వెళ్లిపోవడంతో సగానికి పైగా సచివాలయాల్లో సిబ్బంది కొరత ఏర్పడింది. గత ప్రభుత్వం ప్రతి సచివాలయంలో వివిధ విభాగాలకు చెందిన అన్నిశాఖల అధికారులను నియమిస్తూ ఒక్కో సచివాలయానికి 11 మంది అధికారులను నియమింపజేసింది. ఆ దిశగా మండలంలో ఉన్న 13 సచివాలయాలకు సంబంధించి 143 మంది అధికారులు ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఈ సంఖ్య 65 నుంచి 70కి పరిమితమైంది. దీని కారణంగా ఒక్కో సచివాలయంలో నలుగురు నుంచి అయిదుగురు అధికారులు మాత్రమే విధులకు హాజరవుతున్నారు. ఈ పరిస్థితులతో ప్రభుత్వం చేపడుతున్న హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేలోనూ మండలం వెనుకబడుతోంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు మండలంపై ప్రత్యేక ఫోకస్ పెట్టినప్పటికీ సర్వేలో మాత్రం వెనుకంజలోనే ఉంది.


మరదవాడలో కార్యదర్శి లేక ఖాళీగా కుర్చీలు

ఎంపీడీవో కార్యాలయంలో భర్తీ కావాల్సిన పోస్టులు

ఖాళీగా ఉన్న పోస్టు	పోస్టుల సంఖ్య
సీనియర్ అసిస్టెంట్	1
టైపిస్ట్	1
ఈఓపీఆర్డీ	1
ఏపీఎం	1
పంచాయతీరాజ్ ఏఈ	1
పంచాయతీ కార్యదర్శులు	7

పనుల పర్యవేక్షణకు ఇబ్బందులు

మండలంలో అభివృద్ధి పనుల పర్యవేక్షణకు, ఇటు కార్యాలయ పనుల పర్యవేక్షణకు అధికారుల కొరత పెద్ద సమస్యగా మారింది. ప్రధానంగా మండల ప్రగతిలో పంచాయతీరాజ్ కీలకం. అయితే ఆ శాఖ పర్యవేక్షించాల్సిన మండల అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో బీఎన్‌కండ్రిగ మండలానికి చెందిన పంచాయతీ రాజ్ ఏఈగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా నిర్వహించిన పల్లె పండుగ పనుల పర్యవేక్షణకు పంచాయతీరాజ్ ఏఈ లేకపోవడంతో పనుల్లో వెనుకబడుతున్నారు. దీంతో రూ.1.70 కోట్లతో 4.4 కి.మీల మేరకు నిర్మించాల్సిన పల్లె పండుగ రోడ్డు పనులు ఆలస్యం అవుతున్నాయి. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో కార్యాలయ పనుల నిర్వహణలో కీలకంగా వ్యవహరించాల్సిన సీనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పంచాయతీల పర్యవేక్షణ చేపట్టాల్సిన ఈఓపీఆర్డీ పోస్టు ఏడాదికి పైగా ఖాళీగానే ఉంది. పొదుపు సంఘాల పర్యవేక్షణ చేపట్టాల్సిన ఏపీఎం పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉండడంతో రుణాలు సకాలంలో చెల్లించే డ్వాక్రా సంఘాలకు బ్యాంకు రుణాలు అందుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలా అనేక విభాగాల్లో అధికారుల కొరత మండల ఎంపీడీఓ కార్యాలయాన్ని వేధిస్తోంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

రుచికరమైన భోజనం పెట్టాలి


మధ్యాహ్నభోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మెనూ ప్రకారం రుచి కరమైన భోజనాన్ని పెట్టాలన్నారు. అదే విధంగా రాగి జావను క్రమం తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చలం సాహిత్యంపై వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

సత్యవేడు : తిరుపతి ప్రజా కళావేదిక ఆధ్వర్యంలో మదనంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చలం సాహిత్య పుస్తక పఠనంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా కళావేదిక వ్యవస్థాపకుడు జయపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సాహిత్యం, పుస్తక పఠనంపై ఆసక్తి పెంచడానికి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపిక అందజేస్తామన్నారు. మాతృభాషను గౌరవించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు ఈ పోటీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చిన్నబాబు, తెలుగు పండిట్ అమర్‌నాథరెడ్డి, నాగరాజు, గోపి, పద్మావతి పాల్గొన్నారు.

ఊంజల్ సేవలో పద్మావతీ అమ్మవారు



నారాయణవనం : పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఊయల సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరిచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను చేశారు. ఉదయం 7 గంటలకు వేంకటేశ్వరస్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి అభిషేకాలను నిర్వహించి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం నిత్య కైంకర్యాలను నిర్వహించిన అర్చకులు తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని అలంకరించి అధిష్ఠింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపానికి వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ మల్లికార్జున్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



ర్యాలీ చేస్తున్న పాఠశాల విద్యార్థులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం రోడ్ సేఫ్టీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒకటో పట్టణ సీఐ గోపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోడ్డు భద్రతా నియమాలు, విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ వివరించారు.అనంతరం ప్రిన్సిపల్ రూపాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు సమాజంపై అవగాహన అవసరమన్నారు. అనంతరం పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించి ఏపీ సీడ్స్ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏజీఎం సురేష్, డీన్ సుబ్రహ్మణ్యం, ఏఓ సురేష్, ఇన్‌చార్జులు త్రివేణి, థామస్, పీఈటీ మేఘన పాల్గొన్నారు.


మానవ హారంగా నిలబడిన విద్యార్థులు

పామాయిల్ సాగుతో లాభాలు


పామాయిల్ సాగుపై అవగాహన కల్పిస్తున్న యామిని

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కనమనంబేడులో శుక్రవారం పామాయిల్ తోటల సాగుపై ఉద్యానవన శాఖాధికారిణి యామిని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పామాయిల్ గింజలు వాణిజ్య పంట కావడంతో మార్కెట్‌లో డిమాండ్ ఉందని, రైతులకు తోటల పెంపకంతో లాభాలు వస్తాయని తెలిపారు. ఆరుతడి పంట కావటంతో రైతులకు నీటి ఇబ్బంది ఉండదన్నారు. మెట్ట భూముల్లో వీటి పెంపకం బాగుంటుందన్నారు. ఒక మొక్క ధర రూ. 193 ఉంటుందని, ఎకరాకు 57 మొక్కలు నాటాలని, నాలుగో ఏడాది నుంచి పంట దిగుబడి వస్తుందని, 30 ఏళ్ల సాగులో ఉంటుందన్నారు. మొక్కలను త్రీఎఫ్ కంపెనీ వారు రైతులకు ఉచితంగా పామాయిల్ మొక్కలను పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రభుత్వం నాలుగు సంవత్సరాలకు రూ.69 వేలను రాయితీ రూపంలో అందజేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ వారితో కలసి యువరాజ్ పొలాలలో పామాయిల్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో త్రీఎఫ్ జోనల్ అధికారి మురళి, ఏరియా మేనేజర్ రాజేష్, క్లస్టర్ అధికారి ఆనందబాబు, రైతులు ఈశ్వరమ్మ, మాధవయ్య, కన్నయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి సేవలో మాజీ ఎమ్మెల్యే


ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి , మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : రాపూరు మండలం పెంచలకోనలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసం సందర్భంగా జరిగిన హోమ పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సాధన మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, సురేష్, వేలూరు రమేష్, ఈశ్వర్‌సాయి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రేణిగుంట : మండలంలోని గాజులమండ్యంలో అతి పురాతనమైన శ్రీబాలసుబ్రహ్మణ్య స్వామి ఆలయ జీర్ణోద్ధరణ చేసి శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ ఆవరణలోని పురాతన ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో నూతన ఏకశిలా రాతి ధ్వజస్తంభాన్ని తయారు చేశారు. శ్రీ బాల సుబ్రహ్మణ్య స్వామి ఆలయ 11వ వార్షికోత్సవంలో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. ఉదయం స్వామి మూల విరాట్‌కు అభిషేక పూజలు చేసి అలంకరించారు. వేద పండితులు దండ పాణి స్వామి ఆధ్వర్యంలో నూతన ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మునిరత్నం, రంగయ్య, జువ్వల ధనుంజయరెడ్డి, మునిరత్నం, చంద్రబాబు, మునీశ్వరయ్య, చక్రవర్తి, సాయి, రవికుమార్, ఆలయ అర్చకులు గణేష్ స్వామి పాల్గొన్నారు.


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠ చేస్తున్న గ్రామపెద్దలు


శ్రీబాలసుబ్రహ్మణ్య స్వామి మూలవిరాట్

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ను జయప్రదం చేద్దాం

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని కలిసి డిసెంబర్ 7వ తేదీన భారీ ఎత్తున నిర్వహించ తలపెట్టిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునీంద్రబాబు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కూనాటి సురేష్, మల్లికార్జున, మురళి, రమేష్ బాబు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహించాలి

వరదయ్యపాళెం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ డే సమావేశాలను నిర్వహించాలని ఎంపీడీఓ ప్రసాద్ సూచించారు. ఎంఈఓ-2 గున్నయ్య అధ్యక్షతన శుక్రవారం వరదయ్యపాళెం హైస్కూల్‌లో మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పేరెంట్స్ డే విజయవంతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు విద్యార్థుల తల్లిదండ్రులకు, స్థానిక ప్రజాప్రతినిధులు తప్పక సమావేశాలకు హాజరయ్యే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సమావేశాలు నిర్వహించి విజయవంతం చేయాలని తహసీల్దార్ రాజశేఖర్ కోరారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన అవసరం


మానవ హారం చేపట్టిన విద్యార్థినులు


ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాళహస్తి : ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు ర్యాలీ, మానవహారం చేపట్టారు. అంతకు ముందు విద్యార్థినులకు రంగోలి, డిబేట్ వంటి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించలేమని కేవలం నివారణ ఒకటే మార్గమన్నారు. ఎయిడ్స్‌పై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శైలజ, దీనదయాళ్, మాలతి గాబ్రియేల్, నరసింహారావు, శ్రీకాంత్‌రెడ్డి, నీరజ, సుమతి, అనూజ, సాహితి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్లు

శ్రీకాళహస్తి : నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మండలానికో టోల్ ఫ్రీ నంబరు తీసుకొచ్చారు. శుక్రవారం ఎన్టీఆర్ భవన్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరుగా ఎవరైనా సమస్యను ఎమ్మెల్యే కార్యాలయానికి తెలిపితే అధికారుల సమన్వయంతో సమస్యను పరిష్కరిస్తామన్నారు. శ్రీకాళహస్తి టౌన్ మనోజ్‌కుమార్ 94917 06316, శ్రీకాళహస్తి రూరల్ మణెమ్మ 70321 78191, తొట్టంబేడు భారతి 91820 31426, ఏర్పేడు హేమ 94418 55939, రేణిగుంట సుజాత 83670 90320 నంబర్లకు ఫోన్ చేసి ఆయా గ్రామాల్లోని సమస్యలను వివరించాలన్నారు.

వేలంపాట వాయిదాకు వినతి

రేణిగుంట : పంచాయతీలో డిసెంబర్ 2వ తేదీన నిర్వహించనున్న వారపు సంత, బస్టాండు, కూరగాయల మార్కెట్, దుకాణ సముదాయాలకు బహిరంగ వేలం పాటను వాయిదా వేయాలని వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శికి శుక్రవారం విన్నవించారు. వార్డు సభ్యులు రాజేష్ రెడ్డి, మహబూబ్ బాషా పంచాయతీ కార్యాలయంలోని కార్యదర్శి మణికి వినతిపత్రాన్ని అందించారు. వేలంపాటలో గుత్తేదారులు పాల్గొనాలంటే సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకోవడానికి సమయం లేకపోవడంతో పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆయనకు వివరించారు. వేలం పాట తాత్కాలికంగా రెండు మూడు రోజులు వాయిదా వేయాలని కోరారు. పంచాయతీకి ఆదాయం కూడా తగ్గే అవకాశం ఉందని, పంచాయతీలో ప్రజలందరికీ తెలిసేలా దండోరా వేయించాలని, అలాగే పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసిన తరువాతే వేలం పాట నిర్వహించాలని కోరారు.

రేపు కార్తీక వన భోజనోత్సవం

శ్రీకాళహస్తి : పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో శ్రీకాళహస్తీశ్వర క్షేత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 11గంటలకు సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ఆర్థిక లావాదేవీలపై ఆడిట్

వరదయ్యపాళెం : మండల పరిషత్ కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన లావాదేవీలపై ఎంపీడీఓ కార్యాలయంలో ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఆ మేరకు తిరుపతికి చెందిన సీనియర్ ఆడిటర్ ఆధ్వర్యంలో సిబ్బంది రిపోర్టు సిద్ధం చేస్తున్నారు. ఆ మేరకు జమ ఖర్చులకు సంబంధించి బిల్లులు, బ్యాంకు స్టేట్‌మెంట్‌లు, ఓచర్లు, ఎం-బుక్‌లను సవివరంగా పరిశీలన చేస్తున్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నాగలాపురం : సామాజిక భద్రత పింఛన్‌లు శనివారం పంపిణీ చేస్తున్నట్లు స్థానిక ఎంపీడీఓ బాలాజీనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 5,432 మంది పింఛన్ లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది ద్వారా నగదు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు పింఛన్ నగదు పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి

శ్రీకాళహస్తి : మండలంలోని పెంకులపాడుకు చెందిన వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు చుక్కల మహేష్ తండ్రి శంకరయ్య శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు సాధన మున్నా, బుల్లెట్ జయశ్యామ్ పాల్గొన్నారు.


శంకరయ్య మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శిలాఫలకాన్ని ఢీకొన్న లారీ


లారీ ఢీకొనడంతో ధ్వంసమైన శిలాఫలకం

నాగలాపురం : స్థానిక పడమటి దళితవాడకు వెళ్లే దారిలో ఆగష్టు 2021లో నాగలాపురం- చిన్నపాండూరు రోడ్డు విస్తరణ పనులకు వేసిన శిలాఫలకాన్ని శుక్రవారం సాయంత్రం లారీ ఢీకొనడంతో ధ్వంసం అయింది. అప్పటి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కె.నారాయణ స్వామి, ఎంపీ గురుమూర్తి , ఆదిమూలం చేతుల మీదుగా శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆ శిలాఫలకాన్ని తిరుపతి నుంచి సత్యవేడు హైవే మీద వెళ్లాల్సిన లారీ డ్రైవర్ మద్యం తాగి గ్రామం లోపలికి వచ్చి తాగిన మైకంలో శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని లారీ ఢీకొనడంతో ధ్వంసం అయింది. అక్కడ ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు డ్రైవర్‌ను అదుపులో తీసుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు.

అడుగుకో గుంత..
నిర్లక్ష్య పంథా

వరదయ్యపాళెం : మండల కేంద్రమైన వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో ప్రధానంగా వర్షం వస్తే వీధులు జలమయం అవుతున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడుతోంది. వాహనదారులతో పాటు పాదచారులు అడుగు తీసి అడుగు వేయాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీనిపై పంచాయతీ పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వరదయ్యపాళెం పట్టణం నుంచి గోపాలరావు కాలనీకి వెళ్లే మార్గంలో పూర్తిగా అధ్వానంగా మారిందని ఆ ప్రాంతంలోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం గుంతలు పూడ్చలేని దుస్థితిలో పంచాయతీ పాలకులు ఉన్నారని స్థానికులు మండి పడుతున్నారు.


వరదయ్యపాళెంలోని గోపాలరావుకాలనీకి వెళ్లే రోడ్డు దుస్థితి

‘ఊరందూరు’ కష్టాలు

- రైల్వేగేటుతో గంటల తరబడి నిరీక్షణ
- రాకపోకలకు తీవ్ర అంతరాయం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగ్రామం ఊరందూరుకు 30 ఏళ్లుగా పట్టణంలోకి రావాలంటే ఒకటే రోడ్డు.. అదీ రైల్వే గేటు దారి.. ట్రాక్ మరమ్మతులు చేసిన సమయం.. రైలు రాకపోకలు సాగించే సమయంలో గంటల తరబడి ప్రజలు నిరీక్షణ చేయాల్సి వస్తోంది. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు మార్గంలో వెళ్లే ప్రజల రహదారి కష్టాలు వర్ణనాతీతం. శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్ వద్ద రైల్వేగేటు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. రైల్వే అధికారులు పాత పట్టాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.


అండర్ బ్రిడ్జి కింద నిలిచిన నీటిలో వెళుతున్న వాహనదారులు


ఊరందూరుకు వెళ్లే మార్గంలో రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు

కొత్త పట్టాలను ఏర్పాటు చేస్తుండటంతో శ్రీకాళహస్తి నుంచి పంగూరు మార్గంలో వెళ్లే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ఊరందూరు రెవెన్యూలోని కర్మాగారాల సిబ్బంది అవస్థలు పడుతున్నారు. రైల్వే గేటు ముసివేయడంతో రైల్వే వంతెన కింద నుంచి వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాలు వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్లు, కార్లు అతి కష్టం మీద వెళుతున్నాయి. వంతెన కింద భాగంలో వర్షపు నీరు నిలిచి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రత్యామ్నాయ రోడ్డు మార్గం ఏర్పాటు చేయకుండా రైల్వే అధికారులు, ఇటు ఆర్అండ్‌బీ అధికారులు గేట్లు మూసివేయడంతో ప్రజలు కష్టాలు పడుతున్నారు. ఏర్పేడు మండలంలోని పలు గ్రామాలకు వెంటగిరికి వెళ్లడానికి ఈ దారి ఎంతో ఉపయోగకరంగా ఉంది. అధికారులు పనులు వేగవంతంగా పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.